

నర్సింగ్.. మరింత మెరుగ్గా..
రోగులకు సేవలందించడంలో నర్సుల పాత్ర కీలకం. నిస్సత్తువతో ప్రాణాలు కళ్లలో పెట్టుకుని బతుకీడుస్తున్న రోగుల హృదయాల్లో వారి స్థానం ఎంతో ఉన్నతం.



ఆమె స్థానం గురుతరం
పరీక్షలు ఏవైనా ఫలితాల్లో చాలా వరకూ బాలికలే ప్రతిభ కనబరచడం చూస్తుంటాం. ఇటీవల నిర్వహించిన డీఎస్సీలో కూడా మహిళలు సత్తా చాటారు.

8లో

కడలిలోకి 4.17 లక్షల క్యూసెక్కులు
ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం 4,17,649 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు డెల్టాకు 3,700, మధ్య డెల్టాకు 1,400, పశ్చిమ డెల్టాకు 4,500 క్యూసెక్కుల చొప్పున విడుదల చేశారు.



న్యూస్‌రీల్

నేడు ఉద్యోగుల గ్రీవెన్స్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి శుక్రవారం సాయంత్రం 4 గంటలకు కలెక్టరేట్ పీజీఆర్ఎస్ హాలులో ప్రత్యేక గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి అన్ని శాఖల అధికారులూ తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. గతంలో వివిధ శాఖల ప్రభుత్వ ఉద్యోగులు సమర్పించిన వినతులకు సంబంధించిన నివేదికలు తీసుకుని రావాలని ఆదేశించారు.

మెరిట్ స్కాలర్‌షిప్ నమోదు గడువు పెంపు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): గత ఏడాది డిసెంబర్ 8న జరిగిన నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలో ఎంపికైన విద్యార్థులు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో నమోదు చేసుకునేందుకు గడువును ఈ నెల 30 వరకూ పొడిగించారు. జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు గురువారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. ప్రభుత్వ, ఎయిడెడ్ విద్యాలయాల్లో ఈ ఏడాది 10, 11, 12 తరగతులు (ఇంటర్మీడియెట్) సాధారణ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులందరూ ఈ సంవత్సరం రెన్యువల్ చేసుకోవడానికి అర్హులని వివరించారు. గడువులోగా రెన్యువల్ చేసుకోని వారికి స్కాలర్‌షిప్ మంజూరు కాదన్నారు. రెన్యువల్ చేసుకున్న ప్రతి విద్యార్థీ తన బ్యాంక్ ఖాతాను ఆధార్ నంబరుకు సీడ్ చేయించుకుని, ప్రత్యక్ష నగదు బదిలీ విధానంలో డబ్బులు జమయ్యేలా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

పాత వ్యాపారులకే బార్లు

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో ఏర్పాటు చేయనున్న బార్లకు గురువారం లాటరీ నిర్వహించారు. జిల్లాలో 22 ఓపెన్ కేటగిరీ, మూడు రిజర్వ్ కేటగిరీ బార్లకు గాను మొదటి విడతలో ఆరు ఓపెన్, మూడు రిజర్వ్ కేటగిరీ బార్లకు లాటరీ తీసి, లైసెన్సులు మంజూరు చేశారు. రెండో విడతలో ఓపెన్ కేటగిరీలో 16 బార్లకు రీ నోటిఫికేషన్ ఇవ్వగా 11 బార్లకు మాత్రమే 44 దరఖాస్తులు వచ్చాయి. వీటికి రాజమహేంద్రవరంలోని తన కార్యాలయంలో ఆర్డీఓ కృష్ణనాయక్ గురువారం లాటరీ నిర్వహించారు. రాజమహేంద్రవరంలో తొమ్మిదింటికి, నిడదవోలు, కడియపులంకల్లో చెరొక బారుకు డ్రా తీశారు. వీటిని దక్కించుకున్న వ్యాపారులకు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి చింతాడ లావణ్య లైసెన్సులు మంజూరు చేశారు. రాజమహేంద్రవరంలో నాలుగు, కొవ్వూరులో ఒక బారుకు ప్రభుత్వం మళ్లీ నోటిఫికేషన్ ఇవ్వనున్నదని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రాహుల్, ఇతర అధికారులు పాల్గొన్నారు. కాగా, గురువారం జరిగిన లాటరీలో అధిక శాతం బార్లను పాత వ్యాపారులే దక్కించుకున్నారు. వారు ప్రతి బారుకు 4 చొప్పున దరఖాస్తులను ఒక పేరుతోనే అందజేశారు. దీంతో లాటరీ నామమాత్రంగానే నిర్వహించాల్సి వచ్చింది. నగరానికి చెందిన టీడీపీ నాయకుడు ఎంవీకే రామచంద్రమూర్తి (మజ్జి రాంబాబు) సైతం ఒక బారుకు నాలుగు దరఖాస్తులు దాఖలు చేసి దక్కించుకున్నారు. మొత్తం రెండు బార్లను కూటమి నేతలు దక్కించుకున్నారు.

రత్నగిరిపై 22 నుంచి దసరా వేడుకలు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని సన్నిధిలో శరన్నవరాత్ర వేడుకలు (దసరా ఉత్సవాలు) ఈ నెల 22 నుంచి వచ్చే నెల రెండో తేదీ వరకూ ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 22వ తేదీ ఉదయం 9 గంటలకు పండితులు సత్యదేవుని ఆలయంలో కలశ స్థాపన చేసి, ఈ ఉత్సవాలకు అంకురార్పణ చేస్తారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఉత్సవాల సందర్భంగా కుంకుమ పూజలు, వైదిక కార్యక్రమాలు నిర్వహించే 44 మంది రుత్విక్కులు, 16 మంది అర్చకులకు దీక్షా వస్త్రాలు అందజేస్తామని అధికారులు తెలిపారు.

రోజుకో అలంకరణలో..

ఈ నెల 25, 26 తేదీల్లో చవితి తిథి ఉన్నందున దసరా ఉత్సవాలు 11 రోజులు జరగనున్నాయి. ఈ 11 రోజులూ రోజుకో అలంకరణలో వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లను అలంకరించి పూజిస్తారు. తొలి రోజైన 22వ తేదీన బాలాత్రిపుర సుందరి, 23న కల్యాణ గౌరీదేవి, 24న అన్నపూర్ణాదేవి, 25న శారదాదేవి, 26న మహాలక్ష్మి, 27న గాయత్రీదేవి, 28న మహాచండి, 29న సరస్వతి, 30న దుర్గాష్టమి నాడు దుర్గాదేవి, అక్టోబర్ 1న మహర్నవమి నాడు మహిషాసురమర్దిని, అక్టోబర్ 2న విజయ దశమి పర్వదినాన రాజరాజేశ్వరి అలంకరణల్లో అమ్మవార్లు భక్తులకు దర్శనమిస్తారు. దుర్గాష్టమి నాడు చండీహోమం ప్రారంభించి, మహర్నవమి నాడు కొనసాగిస్తారు. విజయ దశమి పర్వదినం నాడు పూర్ణాహుతి నిర్వహిస్తారు. అదే రోజు సాయంత్రం కొండ దిగువన దేవస్థానం హైస్కూల్ వద్ద శమీపూజ నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేస్తారు. ఈ సందర్భంగా సత్యదేవుడు, అమ్మవారిని గజ వాహనం మీద అన్నవరంలో ఊరేగిస్తారు. దసరా వేడుకలకు వనదుర్గ, కనకదుర్గమ్మ అమ్మవార్ల ఆలయాలను సర్వాంగసుందరంగా ముస్తాబు చేస్తున్నారు.

పత్రికా స్వేచ్ఛను హరించడం సరికాదు



ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పని చేస్తున్న మీడియా రంగాన్ని అణచివేసేలా కూటమి ప్రభుత్వం చేపడుతున్న చర్యలు సరికాదు. గతంలో ఏ ప్రభుత్వంలోనూ ఇలాంటి పరిస్థితులు లేవు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా.. చేస్తున్న మోసాలను, వైఫల్యాలను ప్రజలకు తెలియజేస్తోందనే కక్షతో సాక్షి ఎడిటర్, పాత్రికేయులపై అక్రమంగా కేసులు పెట్టడం దారుణం. ఈ అక్రమ కేసులు వెంటనే ఎత్తివేయాలి.

– ఆకుల వీర్రాజు, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) మాజీ చైర్మన్



అక్రమ కేసులు సిగ్గుచేటు



ప్రజాస్వామ్యంలో ఎన్నడూ లేని విధంగా కూటమి సర్కార్ నీచ సంస్కృతికి నాంది పలుకుతోంది. విలేకర్ల సమావేశంలో టీడీపీ నేతల అక్రమాల గురించి మాట్లాడితే.. పత్రిక పైన, సాక్షి ఎడిటర్, పాత్రికేయులపై కేసులు పెట్టడం సిగ్గుచేటు. పత్రికా స్వేచ్ఛను హరిస్తూ.. రాజ్యాంగ విలువలను కూటమి పాలకులు కాలరాస్తున్నారు. రాష్ట్రంలో జరుగుతున్న దారుణాలను తెలుగు ప్రజలకు వివరించడమే విలేకర్లు చేసిన తప్పా? సాక్షి ఎడిటర్, పాత్రికేయులపై కేసులు తక్షణం ఎత్తివేయాలి.

– చందన నాగేశ్వర్, మాజీ చైర్మన్, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్

● మెడి'కల'ను చిదిమేస్తారా!

ప్రైవేటీకరణం



రాజమహేంద్రవరం ప్రభుత్వ వైద్య కళాశాల

- వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై ఉద్యమ బాట
- నేడు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యాన 'చలో మెడికల్ కాలేజ్'
- విద్యార్థులు, యువత, ప్రజలు పాల్గొనాలని పిలుపు

సాక్షి, రాజమహేంద్రవరం: వైద్య విద్యను అభ్యసించాలనే పేద విద్యార్థుల కలను చిదిమేసే దిశగా కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. వీటిలో 5 కళాశాలల్లో తరగతులు ప్రారంభమయ్యాయి కూడా. ఈ నేపథ్యంలో గత ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు.. ప్రభుత్వ వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో దశల వారీగా ప్రైవేటీకరించాలని ఇటీవల నిర్ణయించింది. ఈ నిర్ణయం వైద్య విద్య చదువుకోవాలనే పేద విద్యార్థులకు అశనిపాతమే అవుతోంది. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ వలన వైద్య విద్య తమకు భారంగా మారుతుందని వారు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని ప్రజలతో పాటు వైఎస్సార్ సీపీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ప్రైవేటీకరణను ఆపేందుకు ఎంత వరకైనా వెళ్లేందుకు సిద్ధమని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ యువజన, విద్యార్థి విభాగాల ఆధ్వర్యాన శుక్రవారం 'చలో మెడికల్ కాలేజ్' కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ ఆందోళనలో యువత, విద్యార్థులతో పాటు ప్రజలందరూ పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆ పార్టీ నేతలు విజ్ఞప్తి చేస్తున్నారు.

రాజమహేంద్రవరంలో సర్వాంగ సుందరంగా..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో చారిత్రక నగరి రాజమహేంద్రవరంలో ప్రభుత్వ వైద్య కళాశాల శరవేగంగా రూపుదిద్దుకుంది. దాదాపు లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో తాత్కాలిక కళాశాల నిర్మించారు. అకడమిక్ కార్యకలాపాలకు వీలుగా ప్రీ-ఇంజినీర్డ్ బిల్డింగ్ (పీఈబీ) నిర్మించారు. మరో వైపు 12 ఎకరాల విస్తీర్ణంలో శాశ్వత కళాశాల భవనాల నిర్మాణం సైతం శరవేగంగా చేపట్టారు. బోధన వైద్య కళాశాల, ఆసుపత్రి నిర్మాణ పనులను రూ.475 కోట్లతో యుద్ధప్రాతిపదికన చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన ఈ పనులు అప్పటికే సింహభాగం పూర్తయ్యాయి. కళాశాల టీచింగ్ స్టాఫ్ క్వార్టర్స్, మెడికో, నర్స్ హాస్టల్స్ తదితర భవనాల నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

వైద్యులు, సిబ్బంది నియామకం

కళాశాలలో విధులు నిర్వహించేందుకు అవసరమైన వైద్యులు, సిబ్బంది నియామక ప్రక్రియను సైతం గత ప్రభుత్వం పూర్తి చేసింది. ఆస్పత్రిలో అంతకు ముందు పని చేస్తున్న వైద్యులను ఇతర ప్రాంతాలకు బదిలీ చేసి, కొత్త వారిని నియమించారు. కళాశాలకు ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్‌తో పాటు 120 మందికి పైగా సిబ్బందిని నియమించారు.



నిర్మాణ దశలో ఉన్న మెడికల్ కళాశాల శాశ్వత భవనం

150 సీట్లతో అడ్మిషన్లు

కొత్త వైద్య కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరం నుంచి అకడమిక్ కార్యకలాపాల నిర్వహణకు అప్పటి వైఎస్సార్ వైద్య విశ్వవిద్యాలయం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఏటా 150 సీట్లతో కళాశాల నిర్వహణకు అనుమతులు వచ్చాయి. మొదటిసారి జరిగిన అడ్మిషన్లలో 120 మంది విద్యార్థులు కళాశాలలో చేరారు. ప్రస్తుతం మూడో సంవత్సరం నడుస్తోంది. కళాశాలలో విశాలమైన ఏసీ లెక్చర్ రూములతో పాటు సువిశాలమైన కారిడార్లు, అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ ల్యాబ్‌లను అందుబాటులోకి తీసుకొచ్చారు. మిగిలిన ల్యాబ్‌లకు కావాల్సిన పరికరాలను కూడా సిద్ధం చేశారు. విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం కల్పించారు. హైజెనిక్ ఫుడ్ అందిస్తున్నారు. ఇప్పటి వరకూ రాష్ట్రంలోనే ఏ ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో లేని విధంగా క్లాస్ రూముల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ ఏర్పాటు చేసి, వైద్య విద్య బోధిస్తున్నారు.

ప్రైవేటీకరణ నిర్ణయం ఉపసంహరించాలి



వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం శాసనసభ సమావేశాల్లోనే ఉపసంహరించుకోవాలి. లేకపోతే నేపాల్ తరహా ప్రజాగ్రహానికి గురి కాక తప్పదు. ఇప్పటి వరకూ టీడీపీ, కూటమి ప్రభుత్వాలు ఒక్క మెడికల్ కాలేజీ కూడా తీసుకొచ్చిన దాఖలాలు లేవు. 15 ఏళ్లకు పైగా సీఎంగా ఉన్న చంద్రబాబు ఒక్క మెడికల్ సీటు కూడా తీసుకు రాలేదు. అటువంటిది గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే 5 కళాశాలల్లో అడ్మిషన్లు ప్రారంభించాం. ప్రభుత్వ వైద్య కళాశాలలను పూర్తి చేస్తే.. మాజీ సీఎం జగన్‌కు పేరు వస్తుందనే దుగ్ధతోనే ప్రైవేటుకు కట్టబెడుతున్నారు. మెడికల్ కళాశాలల్లో సౌకర్యాలు కల్పించలేమని కేంద్రానికి చంద్రబాబు లేఖ రాయడం దుర్మార్గం.

– జక్కంపూడి రాజా, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు

శాంతియుతంగా నిరసన



వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలనే డిమాండుతో యువజన, విద్యార్థి విభాగాల ఆధ్వర్యాన శుక్రవారం 'చలో మెడికల్ కాలేజ్' పేరిట నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ఉదయం 9 గంటలకు జక్కంపూడి రాజా నివాసం నుంచి నేతలు ర్యాలీగా బయలుదేరి ప్రభుత్వ వైద్య కళాశాలకు చేరుకుంటాం. అక్కడ శాంతియుతంగా నిరసన తెలుపుతాం. యువత, విద్యార్థులు, ప్రజలు, ప్రజా సంఘాల నేతలు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.

– కంఠమని రమేష్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు

విద్యార్థులకు అన్యాయం



కూటమి ప్రభుత్వ హయాంలో విద్యార్థులు, యువతకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారనే స్పష్టత లేదు. వైద్య విద్య అభ్యసించాలన్న కలపై కూటమి ప్రభుత్వం కుట్రలు పన్నుతోంది. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ద్వారా పేద విద్యార్థులకు వైద్య విద్య దూరం చేసే కుట్రలు మానుకోవాలి. విద్యార్థులకు అన్యాయం చేస్తే వైఎస్సార్ సీపీ తరఫున పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తాం.

– మానుకొండ చంద్రబాబు, వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు

నూతన కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ



కలెక్టర్ కీర్తి చేకూరికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్పీ నరసింహ కిషోర్



నూతన కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ రాహుల్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జిల్లా నూతన కలెక్టర్ కీర్తి చేకూరిని ఆమె కార్యాలయంలో జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ గురువారం మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అభివృద్ధి, శాంతిభద్రతల పరిరక్షణ, సమన్వయంతో కలసి ముందుకు సాగి, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడం, పరిపాలనలో పారదర్శకత, శీఘ్ర స్పందన, ప్రజలతో నేరుగా మమేకమయ్యే విధానాలు, జిల్లా అభివృద్ధి, ప్రాధాన్య అంశాలపై చర్చించారు. రాజమహేంద్రవరం కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ ఎస్.రాహుల్, కూడా కలెక్టర్ కీర్తి చేకూరిని మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా) చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. రుడా పరిధిలో ప్రతిపాదించిన పలు అభివృద్ధి పనులు, పరిపాలనాపరమైన అంశాలు, గోదావరి పుష్కరాలకు ప్రతిపాదించిన పనులపై చర్చించారు.

పాడి గేదెలకు తక్షణ వైద్య సేవలు

- కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశం
- పెద్దేవంలో పర్యటన
- చనిపోయిన గేదెలకు పరిహారం అందజేయాలని రైతుల విజ్ఞప్తి

తాళ్లపూడి: మండలంలోని పెద్దేవం గ్రామంలో పాడి, చూడి పశువులకు తక్షణం వైద్య సేవలు అందించాలని, వాటి ఆరోగ్య సమాచారం సేకరించి, డీవార్మింగ్ మందులు వేయాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి పశు సంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు. అవసరమైన వాటికి చికిత్స చేయాలని సూచించారు. పెద్దేవం గ్రామంలో పాడి గేదెలు కొద్ది రోజులుగా వరుసగా అంతు చిక్కని వ్యాధితో మృత్యువాత పడుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కలెక్టర్ గురువారం గ్రామంలో పర్యటించారు. గ్రామానికి చెందిన జమ్ముల శ్రీను, గెడ్డం మణికంఠ తదితరుల గేదెలను పరిశీలించి పాడి రైతులు, గ్రామస్తులను కలిసి వివరాలను సేకరించారు. గేదెలు మృత్యువాత పడడానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. సుగంధి చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి మాట్లాడుతూ, రోగవ్యాప్తి జరగకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు. మృతి చెందిన గేదెల రైతుల ఇళ్ల పరిసరాలను పరిశీలించి, నీటి పరీక్షలు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. గేదెల మృతితో ఆర్థికంగా నష్టపోయామని, ఒక్కో గేదె రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకూ ఉంటుందని, ప్రభుత్వం నుంచి నష్టపరిహారం ఇప్పించాలని సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు, ఉప సర్పంచ్ తోట రామకృష్ణ, పాడి రైతులు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. కాలుష్య కాసారంలా మారిన సుగంధి చెరువును ప్రక్షాళన చేయించాలని పలువురు కోరారు. చెరువు చుట్టూ ఉన్న గేదెలకే అంతు చిక్కని వ్యాధి వచ్చినట్టు చెప్పారు. అయితే, కొందరు రైతులు ఇంటి వద్ద ఉన్న పాడి గేదెలు కూడా ఈ వ్యాధి బారిన పడ్డాయని తెలిపారు. కార్యక్రమంలో కొవ్వూరు ఆర్డీఓ రాణి సుస్మిత, జిల్లా పశు సంవర్ధక శాఖ, మండల అధికారులు పాల్గొన్నారు. గ్రామంలో గేదెల వరుస మరణాలకు కారణాలు తెలుసుకునేందుకు గాను మరణించిన గేదెలకు గురువారం పోస్ట్‌మార్టం చేశారు. గేదెల కిడ్నీ, లివర్, గుండె పాడయ్యాయని, లివర్ లోపల, పొట్టలో నత్తలున్నాయని చెబుతున్నారు. వీటి శాంపిల్స్ తీసుకుని ల్యాబ్‌కు పంపుతున్నట్లు మండల పశువైద్యాధికారి వరలక్ష్మి తెలిపారు. ఇదిలా ఉండగా, కొవ్వూరు మండలం ఐ.పంగిడి గ్రామంలో కూడా గేదెలు మృత్యువాత పడుతున్నాయనే సమాచారంతో కలెక్టర్ కీర్తి ఆ గ్రామంలో కూడా పర్యటించారు.



పెద్దేవంలో గేదెల మృతిపై ఆరా తీస్తున్న కలెక్టర్ కీర్తి చేకూరి

వాహన మిత్రఖేదం!



- రవాణా శాఖ అధికారుల నిర్లక్ష్యం
- సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేయక సమస్య
- అయోమయంలో ఆటో డ్రైవర్లు
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అందరికీ లబ్ధి
- చిత్తశుద్ధి లోపించిన కూటమి సర్కార్

కొత్తపేట: రవాణా శాఖ అధికారుల నిర్లక్ష్యం వాహన మిత్ర లబ్ధిదారుల పాలిట శాపంగా మారింది. వాహనాలు విక్రయించినప్పటికీ యజమాని పేరు ఆన్‌లైన్‌లో మారకపోవడం ఆ పథకానికి అనర్హులై ఇబ్బంది పడుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎంతో చిత్తశుద్ధితో ఈ పథకాన్ని అమలు చేసి తమను ఆదుకుందని, ఈ కూటమి ప్రభుత్వం మెలిక పెట్టడం వల్లో, నిర్లక్ష్యం వల్లో తమకు ఆ లబ్ధి అందడం లేదని వారు వాపోతున్నారు.

ఎన్నికల హామీల్లో భాగంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వాహన మిత్ర పథకాన్ని 2018 మే 14న ఏలూరులో ప్రకటించారు. ఆ హామీ మేరకు 2019లో అధికారం చేపట్టి ఆ పథకాన్ని ప్రకటించిన ఏలూరులోనే అక్టోబర్ 4న ఆ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆటో, ట్యాక్సీ, క్యాబ్‌లు కలిగి ఉన్న స్వయం ఉపాధి డ్రైవర్ల వాహనాల నిర్వహణ, బీమా, ఇతర ఖర్చులకు రూ.10 వేలు సాయంగా దోహదపడింది.

కూటమి పాలనలో వాహనాలకు బ్రేకులు

కూటమి ప్రభుత్వం స్త్రీ శక్తి (ఉచిత బస్సు) పథకం ప్రారంభించడంతో ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పోయారు. దసరా కానుకగా ఆటో డ్రైవర్లను ఆదుకునేందుకు ఆ పథకాన్ని పునఃప్రారంభిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న పాలకులు లేనిపోని నిబంధనలు అమలు చేస్తూ అర్హులను అనర్హులను చేస్తున్నారని పలువురు వాపోయారు. గత ప్రభుత్వం అమలు చేసిన ఈ పథకంపై ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని వారంతా విమర్శిస్తున్నారు. ఆ పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు వెళ్లిన తమకు అడుగడుగునా అడ్డంకులు ఎదురవుతున్నాయని డ్రైవర్లు పోతున్నారు. బుధవారం నుంచి వాహన మిత్ర పథకానికి గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అనుమతించింది. కాగా దరఖాస్తు చేసుకునేందుకు వెళ్లిన వాహన యజమానులకు ఆయా గ్రామ సచివాలయాల్లో వారి వాహనం వేరొకరి పేరున చూపిస్తోందని అక్కడి సిబ్బంది చెప్పడంతో వారు అవాక్కవుతున్నారు. గత ప్రభుత్వంలో లబ్ధిదారుల జాబితానే రవాణాశాఖ యంత్రాంగం అప్‌లోడ్ చేయడం వల్ల ఈ పరిస్థితి నెలకొందని వారు వాపోతున్నారు. వాహనం కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్, ఆధార్ సీడింగ్ చేయించుకున్నప్పటికీ ఆ జాబితా అప్‌లోడ్ చేయకుండా తమ వాహనం వేరొకరు పేరున ఉన్నట్టు జాబితాలో చూపడంపై సదరు అధికారులు తీరును డ్రైవర్లు తప్పు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో లబ్ధి పొందిన సుమారు 28 వేల మంది జాబితాలో కొందరు వాహనాలను విక్రయించినా పాత జాబితాను గ్రామ, వార్డు సచివాలయాలకు అందించడం వల్ల ఈ పథకానికి అర్హత కోల్పోయినట్టు వారంటున్నారు. బుధవారం నుంచి ఈ నెల 19 వరకు ఈ పథకానికి దరఖాస్తులు స్వీకరించి, 22 నుంచి పరిశీలన పూర్తిచేసి 24న తుది జాబితా విడుదల చేసేందుకు అధికారులు షెడ్యూల్ రూపొందించారు. ఆ మేరకు లబ్ధిదారులకు అక్టోబరు 1న ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.15 వేలు ఆర్థిక సహాయం అందించేలా ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ గందరగోళ పరిస్థితుల్లో పథకం దరఖాస్తులకు గడువు పెంచి, తాజా జాబితాను రవాణా శాఖ నుంచి తెప్పించి గ్రామ, వార్డు సచివాలయాలకు అందజేయాలని కోరారు.

యంత్రాంగం కసరత్తు

ఓ పక్క రిజిస్ట్రేషన్లకు గడువు విధించడం, మరో పక్క పాత వాహన మిత్ర డేటాతో కొత్త వారికి రిజిస్ట్రేషన్లు కాకపోవడంపై విజయవాడలోని రవాణా శాఖ ఉన్నతాధికారులు ఈ సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేయడానికి తెగ కసరత్తు చేస్తున్నారు.

పరివాహన్ యాప్ తప్పులతడక

ఇటీవల నేను ప్యాసింజర్ ఆటో కొనుగోలు చేసి, ఆధార్ సీడింగ్ చేసినప్పటికీ వాహనమిత్ర పథకానికి నా దరఖాస్తు చెల్లదని సచివాలయ సిబ్బంది తిరస్కరించారు. దీనికి రవాణా శాఖ అధికారులు పరివాహన్ యాప్ నుంచి పంపిన జాబితాయే కారణం. దానిని సరి చేసి, అర్హుల జాబితాను పంపించాలి. లేకుంటే నాలాంటి ఎందరో అర్హులకు అన్యాయం జరుగుతుంది.

– మెర్ల వీరబాబు, ఆటో డ్రైవర్, మెర్లపాలెం, ఆత్రేయపురం మండలం



తాజా రిజిస్ట్రేషన్లకే ఇబ్బంది

అమలాపురం టౌన్: గత వాహన మిత్రలో లబ్ధి పొంది నేటికీ ఆటోల నిర్వహణ రంగంలో ఉన్న వారికి రిజిస్ట్రేషన్లు అవుతున్నాయి. కాగా, ఏడాదిన్నర కాలంలో కొత్తగా ఆటోలను కొనుక్కుని ఈ రంగంలోకి వచ్చిన వారి పేర్లు మాత్రం రిజిస్ట్రేషన్ కావడం లేదు. గతంలో వాహన మిత్ర పథకం కింద జిల్లాలో 4,500 మంది లబ్ధి పొందారు. ఇందులో దాదాపు 2 వేల మంది వరకూ ఈ రంగం నుంచి తప్పుకోవడంతో ఈ సమస్య అనివార్యమైంది. ఉదాహరణకు అమలాపురం మండలం పేరూరు గ్రామ సచివాలయానికి ఐదుగురు ఆటో డ్రైవర్లు రిజిస్ట్రేషన్ కోసం బుధవారం వెళ్లారు. వారు గత ఏడాదిన్నర కాలంలో ఆటోల నిర్వహణ రంగంలోకి రావడంతో వారి పేర్లు డేటాలో కనిపించక కంగారు పడ్డారు. పరివాహన్ సాఫ్ట్‌వేర్ మార్చి డేటా అప్‌లోడ్ చేస్తేనే కానీ కొత్తవారికి రిజిస్ట్రేషన్లు కావని సచివాలయాల సిబ్బంది చెప్పడంతో వారు అయోమయానికి గురవుతున్నారు. జిల్లాలో తాజాగా నమోదైన ఆటో డ్రైవర్ల సంఖ్య దాదాపు 7,500 ఉన్నట్లు సమాచారం. ఇప్పుడు వారందరికీ ప్రభుత్వం రూ.15 వేల వంతున ఇవ్వాల్సిందే.

క్లుప్తంగా

వివాహిత అనుమానాస్పద మృతి


గట్టున సత్యవతి (ఫైల్)

నిడదవోలు: మండలంలోని శెట్టిపేట గ్రామంలో ఒక మహిళ అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన గురువారం ఆలస్యంగా వెలుగుచూసింది. పట్టణ ఎస్సై జగన్‌మోహన్‌రావు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో వాటర్‌ట్యాంక్ ప్రాంతంలో గట్టున సత్యవతి (55) ఒంటరిగా నివసిస్తోంది. భర్త కోటయ్య గతంలో మృతిచెందారు. సత్యవతి చెల్లెలు కాకుమళ్ల దేవి గురువారం మధ్యాహ్నం 3 గంటలకు ఫోన్ చేయగా ఆమె ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో ఇంటి పక్కన ఉంటున్న కూనపురెడ్డి గంగారత్నంకు ఫోన్ చేసి మా అక్కను చూడాలని కోరింది. గంగారత్నం ఇంటికి వెళ్లి చూడగా సత్యవతి బాత్రూరూంలో రక్తపు మడుగులో పడి ఉండటం గమనించింది. ఈ మేరకు పోలీసులకు సమాచారం ఇవ్వగా పట్టణ ఎస్సై జగన్‌మోహన్‌రావు సంఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. మృతురాలి చెల్లెలు దేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సమిశ్రగూడెంలో రెండు చోట్ల చోరీలు


సమిశ్రగూడెంలో చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్సై బాలాజీ సుందరరావు

నిడదవోలు రూరల్: మండలంలోని సమిశ్రగూడెంలో గురువారం తెల్లవారు జామున రెండుచోట్ల జరిగిన దొంగతనాలపై కేసులు నమోదైనట్టు ఎస్సై ఎల్.బాలాజీ సుందరరావు అన్నారు. సమిశ్రగూడెంలోని శ్రీనివాస మెడికల్ షాప్ వీధిలో దంగుల కొండమ్మ ఇంట్లో రూ.80 వేల నగదుతో పాటు 26 తులాల వెండి, అర కాసు బంగారం, కాల్వగట్టుపై ఉన్న కొండేపూడి సుధీర్‌కు చెందిన టీ టైం షాపులో రూ.20 వేల నగదు, 6 గ్రాముల బంగారం, ఒక సెలఫోన్ అపహరించినట్లు బాధితులు ఫిర్యాదు చేశారన్నారు. చోరీ జరిగిన ప్రాంతాలను ఎస్సై బాలాజీ సుందరరావు పరిశీలించి బాధితుల నుంచి వివరాలు అడిగి నమోదు చేసుకున్నారు.

నర్సింగ్.. మరింత మెరుగ్గా..


వార్డుల్లో రికార్డుల పరిశీలన

- జీజీహెచ్‌లో సమూల మార్పులు
- ప్రత్యేక కార్యాచరణ అమలు
- సకాలంలో విధుల నిర్వహణ
- తొలగుతున్న వ్యత్యాసాలు

కాకినాడ క్రైం: వైద్యులతో సమానంగా రోగులకు సేవలందించడంలో నర్సుల పాత్ర కీలకం. నిస్సత్తువతో ప్రాణాలు కళ్లలో పెట్టుకుని బతుకీడుస్తున్న రోగుల హృదయాల్లో వారి స్థానం ఎంతో ఉన్నతం. కన్నతల్లిని, తోబుట్టువుని మరిపించే ఆత్మీయత వారి సొంతం. వారి సేవలు మరింత మెరుగుపడేలా కాకినాడ జీజీహెచ్‌లో అంకురార్పణ పడింది. ఈ మేరకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధమైంది. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి పర్యవేక్షణలో నర్సింగ్ సూపరింటెండెంట్ కల్పన మౌళి ఆధ్వర్యంలో ఆ దిశగా చర్యలు కొనసాగుతున్నాయి.

ప్రతి వార్డు పరిశీలన

ఆస్పత్రిలో ప్రతి వార్డును పరిశీలిస్తూ నర్సింగ్ సూపరింటెండెంట్ సహా హెడ్ నర్సులు వారికి అందుతున్న సేవలపై రోగులను ఆరా తీస్తున్నారు. నర్సులు, నర్సింగ్ విద్యార్థుల ప్రవర్తన స్నేహపూర్వకంగా ఉంటున్నదీ లేనిదీ అడిగి తెలుసుకుంటున్నారు.

తారతమ్యాలు రూపుమాపేలా...

నర్సుల్లో రెగ్యులర్, కాంట్రాక్టు అనే భేదం లేకుండా చూస్తున్నారు. ఎవరెంత అనుకున్నా ఈ వ్యత్యాసం స్పష్టంగా కనిపిస్తుంటుంది. తమ అదృష్టం పండి అర్హత తక్కువగా ఉండీ కూడా రెగ్యులర్ ఉద్యోగులుగా కొనసాగుతున్న కొందరు నర్సులు, ఉన్నత చదువులు చదివి కాంట్రాక్టు నర్సులుగా పనిచేస్తున్న వారిపై అజమాయిషీ చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. పని విషయంలోనూ కాంట్రాక్టు సిబ్బందిపై పని భారాన్ని మోపుతుంటారు. అలాగే ఆస్పత్రిలో ఉన్నతాధికారులతోనూ రెగ్యులర్ సిబ్బందే టచ్‌లో ఉంటారు. అధికారులు సైతం రెగ్యులర్, కాంట్రాక్టు నర్సింగ్ సిబ్బందిని సమానంగా చూడకపోవడం మరో సమస్య. నైట్ డ్యూటీ విషయంలోనూ ఇదే వ్యత్యాసం. కాగా నర్సింగ్ సూపరింటెండెంట్ కల్పన తాజా నిర్ణయంతో అసమానతలకు చెక్ పట్టేందుకు ప్రణాళిక సిద్ధమైంది. అందులో భాగంగా అందరికీ సమానంగా నైట్ డ్యూటీలు వేస్తున్నారు. రుబాబులకు కాలం చెల్లింది. ఏళ్లకు ఏళ్లు ఒకే వార్డులో కొనసాగుతున్న 49 మంది నర్సులకు స్థాన చలనం కల్పించారు. వివిధ సమస్యలతో పాటు అంతర్గత విభేదాలనూ అక్కడికక్కడే పరిష్కరిస్తున్నారు. సమయ పాలన విషయంలోనూ నిర్దిష్ట సమయానికి పది నిమిషాలు గ్రేస్ పిరియడ్ ఇచ్చి విధులకు హాజరయ్యేలా చర్యలు తీసుకున్నారు.


రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీస్తూ..


రోగులకు వడ్డిస్తున్న నర్సులు

ఆహారంలోనూ జాగ్రత్తలు

రోగులకు అందిస్తున్న ఆహారాన్ని అందరికీ అందజేయడంతో పాటు నాణ్యతను పరిశీలించి నర్సింగ్ సూపరింటెండెంట్‌కు నివేదించే ఏర్పాటు చేశారు.

క్లీన్ చేశాక క్లిక్ తప్పనిసరి

వార్డులు శుభ్ర పరిచాక స్టాఫ్ నర్సులు ఫొటోలు తీసి గ్రూప్‌లో అప్‌లోడ్ చేయడం తప్పనిసరి. వార్డు పరిశుభ్రతను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదిస్తున్నారు. రోగి మంచంపై దుప్పట్లు మార్చడంలో నర్సులు సంబంధిత సిబ్బందికి ప్రత్యేక ఆదేశాలు ఇస్తున్నారు. రోగికి అనుగుణంగా వీటిని తీర్చిదిద్దుతున్నారు.

మంచి దిశగా అడుగులు



రోగులకు మంచి జరిగేలా నర్సింగ్ సూపరింటెండెంట్ కల్పన మౌళి ఆధ్వర్యంలో నర్సింగ్ బృందం వారి సేవల్లో సానుకూల మార్పులు తీసుకువచ్చారు. తాజా మార్పులను ఆహ్వానిస్తున్నాం. మంచి దిశగా అడుగులు పడే క్రమంలో ఎదురయ్యే సవాళ్లకు అండగా ఉంటాం. రోగుల సంరక్షణే పరమావధి.

– డాక్టర్ లావణ్యకుమారి, సూపరింటెండెంట్, జీజీహెచ్, కాకినాడ

ఉత్తమ నర్సింగ్ సేవలే లక్ష్యం



కాకినాడ జీజీహెచ్‌లో ఉత్తమ నర్సింగ్ సేవలే లక్ష్యంగా సానుకూల మార్పులకు శ్రీకారం చుట్టాం. అమలు చేసే క్రమంలో పలు సవాళ్లు ఎదుర్కొన్నాం. చేపట్టిన మార్పులు రోగులకు మంచి చేస్తుంటే తాము పడిన కష్టం మర్చిపోతున్నాం. నర్సులు ఎంతగానో సహకరిస్తున్నారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి సహకారంతో వార్డుల్లో నర్సింగ్ సేవలపై నిశిత పరిశీలన చేపట్టి రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నాం.

– టీఎస్ కల్పన మౌళి, గ్రేడ్–1 నర్సింగ్ సూపరింటెండెంట్, జీజీహెచ్, కాకినాడ

ఆమె స్థానం గురుతరం



- డీఎస్సీ–2025లో వారిదే హవా
- 51.6 శాతం పోస్టులకు ఎంపిక

రాయవరం: పరీక్షలు ఏవైనా ఫలితాల్లో చాలా వరకు బాలికలే ప్రతిభ కనబరచడం చూస్తుంటాం. ఇటీవల నిర్వహించిన డీఎస్సీ–2025లో కూడా మహిళలు సత్తా చాటారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 51.6 శాతం మంది ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికయ్యారు. మొత్తం 1,352 పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేయగా, 1,349 మంది ఫైనల్ సెలక్షన్ జాబితాలో ఉన్నారు. నాలుగు పోస్టులకు వివిధ కారణాలతో అభ్యర్థులు లేక పోవడంతో అవి భర్తీ కాలేదు. ఫైనల్ సెలక్షన్ జాబితాకు ఎంపికైన 1,349 పోస్టుల్లో వారిదే అగ్రస్థానంగా ఉంది. స్కూల్ అసిస్టెంట్, ఎస్‌జీటీ, టీజీటీ, పీజీటీ తదితర పోస్టులకు పురుషులు, మహిళా అభ్యర్థులు పోటీ పడ్డారు. తుది జాబితాకు ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థుల్లో 653 (48.4శాతం) మంది పురుష ఉపాధ్యాయ అభ్యర్థులు ఉండగా, 696 (51.6శాతం) మంది మహిళా ఉపాధ్యాయ అభ్యర్థులు ఉన్నారు. గణితం, పీఎస్, సోషల్ స్టడీస్, ఇంగ్లిషు వంటి సబ్జెక్టులు, ఫిజికల్ ఎడ్యుకేషన్ మినహా మిగిలిన సబ్జెక్టులు, ఎస్‌జీటీ పోస్టుల్లో మహిళా ఉపాధ్యాయులే అధిక సంఖ్యలో ఎంపిక కావడం గమనార్హం.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో స్కూల్ అసిస్టెంట్లు, ఎస్‌జీటీ పోస్టులకు ఎంపికైన వారి వివరాలు ఇలా

సబ్జెక్టు	మేల్	ఫిమేల్	మొత్తం
ఎస్‌ఏ తెలుగు	23	35	58
ఎస్‌ఏ ఇంగ్లీషు	50	45	95
ఎస్‌ఏ హిందీ	12	66	78
సంస్కృతం	03	02	05
ఎస్‌ఏ బయాలజీ	45	62	107
ఎస్‌ఏ ఫిజికల్ సైన్స్	55	19	74
ఎస్‌ఏ గణితం	44	20	64
ఎస్‌ఏ సోషల్ స్టడీస్	84	48	132
ఎస్‌ఏ (పీఈ)	142	69	211
ఎస్‌జీటీ (మైదానం)	167	254	421
ఎస్‌జీటీ (ఏజెన్సీ)	28	76	104
మొత్తం	653	696	1,349

ప్రభుత్వ/జెడ్పీ, మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్, ట్రైబల్ వెల్ఫేర్ వంటి యాజమాన్యాలకు చెందిన ఉపాధ్యాయ పోస్టుల్లో మహిళలదే హవా కన్పించింది.

అనధికార డీజిల్ డంపింగ్‌పై కేసు

రాజానగరం: మండలంలోని తూర్పుగానుగూడెం ఐఎస్‌టీఎస్ ఇంజినీరింగ్ ప్రాంగణంలో అనధికారికంగా జరుగుతున్న డీజిల్ ఆయిల్ డంపింగ్‌పై గురువారం సాయంత్రం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడి చేసి వాహనాన్ని సీజ్ చేసి, పలువురిపై కేసు నమోదు చేశారు. ముందుగా అందిన సమాచారం మేరకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ ఎస్.తాతారావు ఆధ్వర్యంలో సివిల్ సప్‌లైస్, లీగల మెట్రాలజీ, ట్రాన్స్‌కో శాఖల అధికారులు గొలుగూరి బాపిరాజు, శివ, వలీ తదితరుల ఆధ్వర్యంలో ఈ దాడి జరిగింది. ఎంఎస్ఓ జి.బాపిరాజు తెలిపిన వివరాల మేరకు రాజమహేంద్రవరానికి చెందిన మేడిశెట్టి గంగరాజు గత మే నెలలో కొనుగోలు చేసిన 2 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన బొలెరో మినీ ట్యాంకర్ నుంచి కళాశాల ప్రాంగణంలో ఒక బస్సుకు అనధికారికంగా డీజిల్ కొడుతుండగా పట్టుకున్నారు. వాటి బిల్లులను మాత్రం వారు చూపలేక పోయారు. తన యజమాని డీజిల్ ఆయిల్ లోడు చేసిన ఈ వాహనాన్ని రాజమహేంద్రవరంలో తనకు ఇచ్చి, ఐఎస్‌టీఎస్‌కి వెళ్లి అన్‌లోడ్ చేయమన్నాడని ఆత్రేయపురానికి చెందిన ట్యాంకర్ డ్రైవర్ పల్లికొండ రాజేష్ తెలిపాడు. వాహన రికార్డులు పరిశీలిస్తే 983 లీటర్ల డీజిల్ ఆయిల్‌ను ఇక్కడ వాహనాలకు కొట్టినట్టుగా గుర్తించామన్నారు. దీని విలువ రూ.97,315 ఉంటుందని అంచనా. వాహనం విలువ రూ.15 లక్షలు వరకు ఉంటుందన్నారు. ట్యాంకర్ యజమాని, డ్రైవర్ల పై కేసులు నమోదు చేసి, వాహనాన్ని సీజ్ చేశామన్నారు.

జాతీయ యోగాలో దేవాన్ష్‌కు రజతం

తుని: స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థలో తొమ్మిదో తరగతి చదువుతున్న బండారు దేవాన్ష్ నాయుడు అండర్ 17 వ్యక్తిగత జాతీయ యోగా పోటీల్లో ద్వితీయ స్థానం సాధించి రజత పతకం గెలుపొందినట్టు విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయప్రకాష్ గురువారం తెలిపారు. ఈ నెల 13 నుంచి 16 వరకు హర్యానా రాష్ట్రం కర్నాల్ పట్టణంలో జాతీయ స్థాయి యోగా పోటీలు జరిగాయన్నారు. తమ విద్యార్థి రజత పతకం సాధించడం గర్వకారణమన్నారు. జాతీయస్థాయిలో ప్రతిభకనబర్చిన దేవాన్ష్ నాయుడిని విద్యా సంస్థల అధినేత సీహెచ్ వీకే నరసింహారావు, వైస్ ప్రిన్సిపాల్ ఎం.అరుణ, యోగా గురువు సురేష్ అభినందించారు.


దేవాన్ష్ నాయుడిని అభినందిస్తున్న శ్రీప్రకాష్ విద్యా సంస్థల అధినేత నరసింహారావు

ఇసుక అక్రమ రవాణా అడ్డగింత

అల్లవరం: కొమరగిరిపట్నం రెవెన్యూ సముద్ర తీరం వెంబడి సీఆర్‌జెడ్ పరిధిలో అనధికారికంగా ఇసుక తవ్వకాలు చేస్తూ రాత్రి వేళల్లో సాగుతున్న అక్రమ రవాణాను ఊటగుంట సావరం గ్రామస్తులు బుధవారం రాత్రి అడ్డుకున్నారు. స్థానిక ఎంపీటీసీ పెచ్చెట్టి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కొంత మంది యువకులు ఇసుకను తరలిస్తున్న నాలుగు లారీలను అడ్డుకున్నారు. సీఆర్‌జెడ్ పరిధిలోని ఇసుకను తరలించడానికి వీల్లేదంటూ నిరసన తెలిపారు. ఇసుక అక్రమ రవాణాపై ఎంపీటీసీ స్థానిక తహసీల్దార్ వీవీఎల్ నరసింహారావు దృష్టికి తీసుకెళ్లారు. రాత్రి వేళల్లో లారీల రాకపోకలతో నిద్ర కోల్పోతున్నారని వారు తహసీల్దార్, అల్లవరం పోలీసులకు తెలిపారు. దీనిపై స్పందించిన పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఇసుక రవాణా చేస్తున్న లారీలను స్వాధీనం చేసుకున్నారు.


సావరం గ్రామస్తులు అడ్డుకున్న ఇసుక లారీ

పాత కక్షలతో వ్యక్తిపై ముగ్గురి దాడి

బాధితుడికి 8 చోట్ల కత్తెర పోట్లు

అమలాపురం టౌన్: రెండు కుటుంబాలకు మధ్య నెలకొన్న పాత కక్షల నేపథ్యంలో ఒకరిపై ముగ్గురు వ్యక్తులు కత్తెరతో 8 చోట్ల దాడి చేశారు. స్థానిక మున్సిపల్ కాలనీకి చెందిన ముమ్మిడివరపు రాంబాబుపై అదే కాలనీకి చెందిన తమ్మలపల్లి పవన్‌కుమార్, భవిరిశెట్టి ధనుష్ అనే అఖిల్, భవిరిశెట్టి వెంకట నర్సమ్మ టైలరింగ్ కత్తెరతో దాడిచేసి గాయపరచినట్టు కేసు నమోదైంది. వీరు మున్సిపల్ కాలనీ సమపంలోని ఆమని ఆటో మొబైల్స్ షాపు ఎదురుగా రోడ్డుపై బుధవారం అర్ధరాత్రి ఘర్షణ పడ్డారు. కోపాద్రిక్తులైన పవన్‌కుమార్, అఖిల్ కత్తెరతో రాంబాబు శరీరంపై విచక్షణా రహితంగా పొడిచారు. ఈ సమయంలో పవన్‌కుమార్, అఖిల్‌ను దాడికి పురిగొల్పిన భవిరిశెట్టి వెంకట నరసమ్మపై కూడా కేసు నమోదైంది. ఇదలా ఉంటే తొలుత ముమ్మిడివరపు రాంబాబే తమ్మలపల్లి పవన్‌కుమార్‌ను గాయపరిచాడని పోలీసుల దర్యాప్తులో తేలింది. తమ్మలపల్లి పవన్‌కుమార్ ఫిర్యాదు మేరకు ముమ్మిడివరపు రాంబాబుపై కౌంటర్ కేసు నమోదైంది. సీఐ పి.వీరబాబు పర్యవేక్షణలో ఎస్సై ఎన్ఆర్ కిషోర్‌బాబు రెండు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాహనం ఢీకొని యువకుడి మృతి


పవన్‌కుమార్

ముమ్మిడివరం: మోటారు సైకిల్‌పై వెళ్తున్న యువకుడిని టాటా ఏస్ వాహనం ఢీకొనడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. ముమ్మిడివరం నగర పంచాయతీ శివారు రాజుపాలెం సెంటర్‌లో మోటారు సైకిల్ మెకానిక్‌గా పనిచేస్తున్న గుబ్బల పవన్‌కుమార్ (27) మోటారు సైకిల్‌పై రాజుపాలెం ఇంటికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న టాటా ఏస్ వాహనం అతి వేగంగా వచ్చి ఢీకొట్టి పక్కనే ఉన్న అంబేడ్కర్ విగ్రహం వరకు ఈడ్చుకుపోయింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. పవన్‌కుమార్ అవివాహితుడు. అతడికి తల్లిదండ్రులు శ్రీనివాసరావు, సత్యవతి, చెల్లి ఉన్నారు. ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో ఆ కుటుంబం కన్నీరు మున్నీరవుతోంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై డి.జ్వాలా సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాహనాల చోరీ కేసులో ముగ్గురి అరెస్టు

కె.గంగవరం: మండలంలో వాహన చోరీలకు పాల్పడిన ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై జానీ బాషా గురువారం విలేకరులకు తెలిపారు. రామచంద్రపురం పట్టణానికి చెందిన పెమ్మిరెడ్డి బాల వెంకట్ ఈ చోరీలకు పాల్పడ్డాడని, ఆ వాహనాలను కోటిపల్లికి చెందిన కర్రి సత్యనారాయణ అలియాస్ నాని, కె.గంగవరం గ్రామానికి చెందిన పెంటపాటి వీరబాబులకు విక్రయించినట్లు తెలిపారు. ఈ ముగ్గురిని గురువారం అరెస్టు చేసి రామచంద్రపురం కోర్టుకు తరలించగా వారికి 14 రోజుల రిమాండ్ విధించినట్టు తెలిపారు. వీరి నుంచి 6 వాహనాలను స్వాధీనం చేసుకుని వాటి యజమానులకు అప్పగించినట్టు తెలిపారు. కేసును సీఐ వెంకట నారాయణ పర్యవేక్షణలో ఛేదించినట్టు తెలిపారు. కాగా వీరబాబు దగ్గర మరో 20 వరకు చోరీ చేసిన బైకులు ఉన్నట్లు సమాచారం.

అట్రాసిటీ కేసులో ఒకరి అరెస్ట్

కపిలేశ్వరపురం: మండపేట పోలీసు స్టేషన్‌లో 2019లో నమోదైన అట్రాసిటీ కేసులో నిందితుడు గాడు సత్యనారాయణను అరెస్ట్ చేసినట్టు సీఐ సురేష్ గురువారం తెలిపారు. ఈ కేసులో రాజమహేంద్రవరం ప్రత్యేక కోర్టు అరెస్ట్ వారెంట్ జారీ చేసిందని, దాని అమలులో భాగంగా హైదరాబాద్‌లో ఉంటున్న సత్యనారాయణను అరెస్ట్ చేసి రాజమహేంద్రవరం ప్రత్యేక కోర్టులో హాజరుపర్చినట్టు సీఐ సురేష్ తెలిపారు.

వాడపల్లి వెంకన్నకు రూ.2.4 లక్షల విరాళాలు


దాతలకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న డీసీ అండ్ ఈఓ చక్రధరరావు

కొత్తపేట: కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి వారి క్షేత్రంలో వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణానికి భక్తులు విరివిగా విరాళాలు సమర్పిస్తున్నారు. దానిలో భాగంగా విశాఖపట్నం జిల్లా చిన్న ముషిడివాడకు చెందిన సిరికి అప్పాజీరావు, శ్రీదేవి దంపతులు, వారి కుటుంబ సభ్యులు రూ 2,00,116, మండపేటకు చెందిన ఉంగరాల సీతరాంప్రసాద్, పద్మావతి దంపతులు, వారి కుటుంబ సభ్యులు రూ.40,116 విరాళంగా సమర్పించారు. వారు ముందుగా స్వామి వారిని దర్శించుకున్నారు. దాతలకు దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు స్వామివారి చిత్రపటాన్ని అందచేశారు.

క్యాష్ కౌంటింగ్ మెషీన్ సమర్పణ

వేంకటేశ్వరస్వామి వారి ఆలయానికి భక్తులు సమర్పించే నగదు లెక్కింపు నిమిత్తం రావులపాలెం మండలం లక్ష్మీపోలవరంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు తరపున క్యాష్ కౌంటింగ్ మెషీన్‌ను బహూకరించారు. ఆ మేరకు గురువారం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దానిని బ్యాంకు ఆర్ఎం జీ శ్రీనివాసరావు డీసీ అండ్ ఈఓ చక్రధరరావుకు అందచేశారు. కార్యక్రమంలో బ్యాంకు ప్లానింగ్ హెడ్ ఎంకేఎస్ శంకర్, బీఎం డి.రాజేష్, సిబ్బంది డి.సూర్యగోపాల్, హేమలత తదితరులు పాల్గొన్నారు.

సమర్థంగా తీవ్రవాదుల ఏరివేత


మాక్‌డ్రిల్ ఆపరేషన్ పుష్కర్‌లో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

- ఓఎన్‌జీసీలో 'ఆపరేషన్ పుష్కర్'
- వివిధ శాఖల సమన్వయంతో మాక్‌డ్రిల్


ఉగ్రవాదుల కోసం కమెండోల ఆపరేషన్


ఉద్యోగిని సురక్షితంగా తీసుకువస్తున్న కమెండో

రాజమహేంద్రవరం రూరల్: ప్రభుత్వ కార్యాలయాల సమీప ప్రాంతాల్లో భద్రతాపరంగా ఎదురయ్యే విపత్తులను ఎదుర్కొనే విధానంపై మాక్ డ్రిల్ నిర్వహించారు. ఓఎన్‌జీసీ భద్రతా విభాగం, స్థానిక పోలీసు అధికారులు, ఏపీఎస్‌పీఎఫ్, ఏపీ పోలీసుల ఆక్టోపస్ కమాండోల మధ్య ప్రతిస్పందన, సమన్వయాన్ని పెంచడానికి గురువారం ఓఎన్‌జీసీ గోదావరి భవన్‌లో ఈ మేరకు 'ఆపరేషన్ పుష్కర్' నిర్వహించారు. ఓఎన్‌జీసీ కార్యాలయంలోకి ఉగ్రవాదులు చొరబడి కీలక సిబ్బందిని బందీలుగా తీసుకుపోయే సందర్భాన్ని ఈ మాక్ డ్రిల్‌లో నిర్వహించారు. వైద్య, రెవెన్యూ, అగ్నిమాపక, ఏపీఎస్‌పీఎఫ్, బొమ్మూరు పోలీస్ స్టేషన్, జిల్లా ఆర్మ్ రిజర్వ్ స్పెషల్ పార్టీ, బాంబు డిస్పోజల్ బృందం, డాగ్ స్క్వాడ్ వంటి వివిధ సహాయక సిబ్బంది ఈ ఆపరేషన్‌లో కీలక పాత్ర పోషించాయి. ఓఎన్‌జీసీ భద్రత, అగ్నిమాపక బృందాలు ఈ ఆపరేషన్‌లో భాగస్వాములయ్యాయి. మధ్యాహ్నం 3.40 గంటలకు ఈ ఆపరేషన్ ప్రారంభించి రాత్రి 8.30 గంటల వరకు నిర్వహించారు. బందీలుగా ఉన్న కీలక సిబ్బందికి ఎటువంటి గాయాలు కాకుండా విడిపించారు. కమెండోలు గంటల తరబడి ఆపరేషన్ నిర్వహించి సమర్థంగా కట్టడి చేశారు. రాష్ట్ర వైద్య బృందం, ఓఎన్‌జీసీ వైద్య విభాగం క్షతగాత్రులకు అవసరమైన వైద్య సహాయం అందించారు. అగ్నిమాపక బృందాలు ఘటనా స్థలంలో సత్వర చర్యలకు సిద్ధంగా ఉన్నాయి. తరువాత, డాగ్ స్క్వాడ్ సంఘటనా స్థలాన్ని సందర్శించి తనిఖీలు చేసింది. ఏఎస్పీ (ఏఆర్) చెంచురెడ్డి, డీఎస్పీలు జగ్గు నాయుడు, జి.విశ్వనాథం, విజయవాడలోని ఆక్టోపస్ స్పెషల్ ఫోర్స్‌కు చెందిన ఇన్‌స్పెక్టర్ ఆర్.రాంబాబు ఈ ఆపరేషన్‌లో బ్రీఫింగ్ చేశారు. ఇన్‌చార్జి సెక్యూరిటీ లెఫ్టినెంట్ కల్నల్ కెఇఎస్ గుసేన్, చీఫ్ మేనేజర్ (సెక్యూరిటీ) పి.శంకర్ ఓఎన్‌జీసి నుంచి నోడల్ అధికారులుగా వ్యవహరించారు.

పరమేశు బయోటెక్‌కు ఉత్తమ పురస్కారం



ఉత్తమ కంపెనీ అవార్డు అందుకుంటున్న ఆనంద్ స్వరూప్

దేవరపల్లి: ఫుడ్ ప్రాసెసింగ్‌లో సంవత్సరపు ఉత్తమ కంపెనీగా ఏపీ చాంబర్స్ బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డు–2025ను స్థానిక పరమేశు బయోటెక్ పరిశ్రమ దక్కించుకుంది. సంస్థ ఎండీ ఆదవాని ఆనంద్ స్వరూప్ ఈ పురస్కారాన్ని అందుకున్నారు. మొక్కజొన్న ఆధారిత స్పెషాలిటీ ఉత్పత్తుల దిగ్గజ సంస్థ బెస్ట్ కంపెనీ ఆఫ్ ది ఇయర్ ఇన్ ఫుడ్ ప్రాసెసింగ్ పురస్కారం దక్కించుకున్నట్టు స్వరూప్ పేర్కొన్నారు. విశిష్ట వృద్ధి సాధిస్తూ నవకల్పనలతో గ్రామీణాభివృద్ధిలో కీలక సేవలు అందిస్తున్నందుకు తమ కంపెనీకి ఈ పురస్కారం దక్కిందని అన్నారు. 2015లో 160 టీపీడీ సామర్థ్యంతో రూ.10 కోట్ల టర్నోవర్ నుంచి 2025 నాటికి 900 టీపీడీ సామర్థ్యం, రూ.770 కోట్ల టర్నోవర్‌కు ఎదిగినట్టు చెప్పారు. కంపెనీ ప్రత్యక్షంగా 400 మంది సిబ్బందికి, పరోక్షంగా 500 మంది కార్మికులకు ఉపాధి కల్పిస్తున్నట్టు ఆయన తెలిపారు. లక్షకు పైగా రైతు కుటుంబాలకు జీవనోపాధి కల్పిస్తున్నట్టు స్వరూప్ పేర్కొన్నారు. అలాగే వేస్ట్–టు–వెల్త్ మోడల్‌ను తమ సంస్థ అమలు చేస్తోందని ఆయన అన్నారురు. ప్రస్తుతం 1200 టీపీడీ ప్లాంటును ఏర్పాటు చేస్తోందని ఆయన చెప్పారు. రెట్టింపు స్థాయిలో ఉద్యోగాల కల్పనతో పాటు గ్రామీణ అభివృద్ధిని వేగవంతం చేయడంపై దృష్టిపెడుతున్నట్టు చెప్పారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

కాకినాడ రూరల్: తూరంగి గ్రామంలోని ఒడ్డు చెరువు ప్రాంతానికి చెందిన వివాహిత బొబ్బిలి సాయి సత్య (29) ఆత్మహత్యకు పాల్పడింది. ఇంద్రపాలెం పోలీసుల కథనం ప్రకారం భార్యభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో గురువారం తెల్లవారుజామున ఇంటిలో చీరతో ఉరివేసుకుని ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే భర్త నూకరాజు, కుటుంబ సభ్యులు ఆమెను కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. సత్యకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇంద్రపాలెం ఎస్సై వీరబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్త కొబ్బరి (క్వింటాల్)	20,000 – 21,500
కొత్త కొబ్బరి (రెండో రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	31,500
గటగట (వెయ్యి)	30,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	30,000
గటగట (వెయ్యి)	28,500
నీటికాయ	
పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	23,000 – 24,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	23,000 – 24,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	5,250
కిలో	350